క్లుప్తంగా

కాలభైరవుడి విశ్వరూప దర్శనం



విశ్వరూప దర్శనంలో కాలభైరవస్వామి

నగరి: శ్రీకరకంఠేశ్వర స్వామి ఆలయంలోని శ్రీకాలభైరవ స్వామి సన్నిధిలో విశేష అష్టమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. పాలు, పంచామృతం, పన్నీరు, కొబ్బరినీరు, చందనం, కదంబం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అభిషేకానంతరం స్వామికి విశ్వరూప అలంకారం చేయగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో విశ్వరూప దర్శనం చేసుకున్నారు. పాల్గొన్న మహిళలందరికీ పసుపు కొమ్ములు, విభూది ప్రసాదాలను ఆలయ నిర్వాహకులు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

సామాజిక తనిఖీ సభ వాయిదా



ఉపాధి పనులపై ఆరా తీస్తున్న పీడీ రవికుమార్

నింద్ర: ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం శుక్రవారం ఉదయం ప్రారంభించారు. సమావేశానికి జిల్లా ఉపాధి పథకం పీడీ రవికుమార్ హాజరయ్యారు. అయితే కొద్దిసేపటికే ఆయన అస్వస్థతకు గురవడంతో సమావేశం నిలిపివేశారు. దీంతో జులై 4 తేదీకి సమావేశాన్ని వాయిదా వేశారు. కార్యక్రమంలో ఏపీడీ సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని ఐటీఐ(పారిశ్రామిక శిక్షణ సంస్థ)లో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కంప్యూటర్, డ్రస్ మేకింగ్, డీజిల్‌మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్ ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. జులై 15 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు 17న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. జులై 21 ఉదయం 10 గంటలకు ఐటీఐలో జరిగే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు రెండు ఫొటోలు, వెరిఫికేషన్ ఫారంతో హాజరు కావాలని కోరారు.

సమయపాలన పాటించాలి



సచివాలయంలో ఎంపీడీఓ సతీష్

పాలసముద్రం: మండల పరిధిలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన తప్పక పాటించాలని ఎంపీడీఓ సతీష్ తెలిపారు. శుక్రవారం పాలసముద్రం గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ఎంపీడీఓ సతీష్ మాట్లాడుతూ గ్రామ సచివాలయానికి సమస్యలతో వచ్చిన వారితో స్నేహభావంతో మాట్లాడి, వారి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అప్పుడే ప్రజలకు నమ్మకం వస్తుందని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, సర్పంచ్ అయ్యప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తోందని కేఎంపురం హెచ్ఎం చలపతిరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కేఎంపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలతోనే సాధ్యమన్నారు. అపోహలకు వెళ్లకుండా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు తులసి, ప్రకాష్, ఎస్ఎంసీ చైర్మన్ సురేష్, మునికృష్ణ పాల్గొన్నారు.

మామిడి రైతుల దైన్యం



అన్‌లోడ్ కోసం నిరీక్షిస్తున్న ట్రాక్టర్లు

- రోడ్లపైనే తిండి, నీరు, నిద్ర
- రోజుకో రేటుతో గిట్టుబాటు ధరల్లేక అవస్థలు
- పట్టించుకోని ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యం



ట్రాక్టర్‌పై అలసిపోయి నిద్రిస్తున్న మామిడి రైతు

అన్నదాత కన్నీరు కారుస్తున్నా పట్టించుకునే దిక్కు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. రుతుపవనాల ఆగమనంతో వర్షాలు పడే అవకాశం ఉండడంతో కాయ రాలిపోతుందని మామిడి రైతు తల్లడిల్లిపోయాడు. పురుగు పడుతుందని భయం, కూలీలను పెట్టి కోసినా కొనే దిక్కు లేక అవస్థలు పడుతున్న మామిడి రైతుల పంటను అమ్ముకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఫ్యాక్టరీల వద్ద పడిగాపులతో రేయింబవళ్లు తిండి, నిద్రలేక అగచాట్లు పడుతున్నారు. –గంగాధరనెల్లూరు

సిఫారసులకే ప్రాధాన్యం

మూడు, నాలుగు రోజులు రోడ్లపై పడిగాపులు కాస్తూ పంట ట్రాక్టర్‌లో వేసుకొని తిండి, నిద్రలేక అవస్థలు పడుతూ లైన్లో నిల్చుని ఉన్న మామిడి రైతులు వెనకబడిపోతున్నారు. సిఫారసు ఉన్నవారు మాత్రం దర్జాగా నేరుగా వెళ్లి మామిడిని అమ్ముకుంటున్నారని రైతులు మండిపడుతున్నారు. జైన్ కర్మాగారంలో రెండో యూనిట్లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి రాత్రి సమయాలలో రైతుల వద్ద కొంత డబ్బులు వసూలు చేసి తమ బంధువులది అని చెప్పి అన్‌లోడింగ్ చేసేస్తున్నారని రైతులు మండిపడ్డారు.

కొనేది రూ.ఆరుకే..

ప్రభుత్వం ఎనిమిది రూపాయలకు కొనమని ఆదేశాలు జారీ చేసినా ఎక్కడా ఆ మాట వినపడడం లేదు. 5, 6 రూపాయలకు ఇష్టం ఉంటే అమ్మండి లేకుంటే వెళ్లండి అంటున్న ఫ్యాక్టరీ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అమ్మకాలు జరిగిన మామిడి పంట డబ్బులు కూడా ఆరు నెలల తర్వాతే వచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ప్రభుత్వం ఎయిట్ ప్లస్ ఫోర్‌ను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.





సాఫ్ట్‌వేర్ పని చేసుకుంటూ ఫ్యాక్టరీ వద్ద వేచిఉన్న యువ రైతు, రోడ్డు పక్కనే భోజనం చేస్తున్న రైతన్న

అమలుకాని వరుస పద్ధతి



నాలుగు రోజులుగా లైన్‌లో నిల్చున్నా.. లోకల్ అంటూ, ఫ్యాక్టరీ సిబ్బంది బంధువులమంటూ దర్జాగా నేరుగా వెళ్లి అన్‌లోడింగ్ చేసుకుంటున్నారు. దీనిపై అధికారులు, ఫ్యాక్టరీ యాజమాన్యం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. అదేవిధంగా టోకెన్లు జారీ చేసే విషయంలో కూడా ముందు ఎవరు వచ్చారు అనే ప్రమాణాన్ని ఎవరు తీసుకోవడం లేదు. ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరిస్తున్నారు.
–నారాయణ స్వామి, ఆముదాల గ్రామం

రైతు వెన్నెముక విరిగిపోయింది



ఆరుగాలం కష్టపడి చెమటోడ్చి, అప్పు చేసి, పెట్టుబడి పెట్టి, కోతకు వచ్చాక కొనుగోలు లేక, గిట్టుబాటు ధర లేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం ఫ్యాక్టరీ యాజమాన్యాలతో సరైన పద్ధతిలో చర్చలు జరిపి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి. పెట్టుబడి పెట్టిన రూపాయి కూడా దక్కేలా లేకుండా వెన్నెముక విరిగి పోయే పరిస్థితి ఉంది. –బాబునాయుడు, రంగాపురం

40 టన్నులకు 10 టన్నుల వేస్టేజీ



మామిడికాయ కోసిన రోజు నుండి దాదాపు ఐదారు రోజులకు ఫ్యాక్టరీకి చేరుకుంటుంది. నానా అవస్థలు పడి ఫ్యాక్టరీలకు చేరుకుని, వే బ్రిడ్జి వద్ద వెయిటేజీ వేసుకున్న తర్వాత 40 టన్నులకు 10 టన్ను మామిడి వేస్టేజీ కింద తీసేస్తున్నారు. రైతులకు కూలీ డబ్బులు కూడా గిట్టుబాటు కావడం లేదు. సబ్సిడీ కథ దేవుడెరుగు పంట డబ్బులు కూడా ఆరు నెలల పైమాటే అంటున్నారు. ఇంకా రైతులకు దిక్కెవరు. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి. –నవీన్, కలిజవేడు గ్రామం

ట్రాక్టర్ బాడుగలు తడిసిమోపెడు



ఇంటి నుండి మామిడి పంటతో బయల్దేరి తిరిగి ఎప్పుడు వస్తామో తెలియని పరిస్థితి. నాలుగైదు రోజులుగా ఉంటున్నా తిండి, నీరు లేక రోడ్లపైనే అవస్థలు పడుతున్నాం. బాడుగ ట్రాక్టర్‌కు నాలుగైదు వేల రూపాయలు ఖర్చు అయిపోతుంది. అదికాకుండా డ్రైవర్‌కు మూడు పూటలా భోజనం సదుపాయాలు అందించాలి. ఈ ఏడాది రైతులను ఎవరు ఆదుకుంటారు. పంట డబ్బులపై ఎంతో ఆశ పెట్టుకున్నాం. కానీ తీవ్ర నిరాశే ఎదురైంది. ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టి రైతులకు మేలు కలిగేలా చేయాలి. – యుగేష్, గారంపల్లి

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహోద్యోగులు

నగరి: మండలంలోని ముడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై ఇతర ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది శుక్రవారం సన్మానించారు. బదిలీపై వెళుతున్న ఆనందమోహన్, శివకుమార్, మునికుమార్‌లను ఘనంగా సన్మానించారు. గణిత ఉపాధ్యాయుడు ఆనందమోహన్ గణితంతో పాటు చదరంగంలో రెండేళ్లపాటు పిల్లలు జిల్లా, రాష్ట్రస్థాయిలో పతకాలు పొందేలా తర్ఫీదు ఇచ్చారంటూ విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. ఆంగ్ల, వ్యాయామ ఉపాధ్యాయులైన శివకుమార్, మునికుమార్‌ల సహకారం మరవలేనిదన్నారు.

అభివృద్ధిపై కూటమి శ్రద్ధ పెట్టాలి



వైఎస్ఆర్ సీపీ సంచికను ఆవిష్కరిస్తున్న శ్రీరంగరాజపురం నాయకులు

శ్రీరంగరాజపురం: మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇకనైనా అభివృద్ధిపై శ్రద్ధ పెట్టాలని శ్రీరంగరాజపురం వైఎస్ఆర్ సీపీ నాయకులు కోరారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్ఆర్ సీపీ ప్రచురించిన సంచికను శుక్రవారం మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఆ పార్టీ అధ్యక్షుడు మణి మండల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిందన్నారు. ఇకనైనా ఇచ్చిన హామీలను నెరవేర్చే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ సీపీ నాయకులు ఎంపీటీసీ సిద్ధయ్య, జనార్దన్, భూపతి రెడ్డి, బాల కృష్ణయాదవ్, ఆనంద్, జయ, అమృత రాజ్, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్డూఅదుపు లేని రసాయన నీరు





చిదంబరనగర్ నుంచి కాలువల్లో ప్రవహిస్తున్న రసాయన నీరు

నగరి: 'కాలువల్లో ఒక్క చుక్క రసాయన నీరు వచ్చినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం, ఇకపై రసాయన నీరు కాలువల్లో ప్రవహించదు, ఈ నిబంధనల మేరకే డైయింగ్ యూనిట్లకు అనుమతులు ఇచ్చాం' అంటూ అధికారులు చెప్పిన మాటలు రసాయన నీటిపై బుడగల్లా తేలిపోయాయి. యథావిధిగా డైయింగ్ యూనిట్లు నడుస్తున్నాయి. యథావిధిగా వాటిలో నుంచి వచ్చే హానికర రసాయనాలు కాలువల్లో ప్రవహిస్తూనే ఉంది. ఆ నీటి పక్కనే నివాసాలున్నవారు రసాయనాల దుర్వాసనను పీల్చాల్సిన దుర్గతి కూడా తప్పడం లేదు. మున్సిపల్ పరిధిలోని చిదంబరనగర్ నుంచి రోజుకు ఒక రంగులో కాలువల్లో వచ్చే నీటిని చూసే దుర్భాగ్యం మాత్రం ప్రజలకు కలుగుతోంది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతోపాటు ఇతర ఉన్నతాధికారుల నుంచి కూడా స్పందన అంతంత మాత్రమే ఉండడంతో డైయింగ్ యూనిట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రజా సంఘాలు, మున్సిపల్ కౌన్సిలర్ల పోరాటాలు హానికర రసాయనాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నాయి.

అభ్యసనా సామగ్రి పంపిణీ



పిల్లలకు అభ్యసనా సామగ్రి పంపిణీ

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ షికారి కాలనీలో ఉన్న విద్యార్థులకు పచ్చికాపల్లం శ్రీలక్ష్మీ బ్రాంచెస్ నిర్వాహకుడు ప్రసాద్ అభ్యసనా సామగ్రి పంపిణీ చేశాడు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 45 మంది విద్యార్థులకు రూ.13 వేలు విలువ చేసే సామగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత ప్రసాద్ మాట్లాడుతూ ప్రాథమిక దశలో ఉన్న పిల్లలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్న పిల్లలను ప్రోత్సహించేందుకు తమ వంతు సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం దాత ప్రసాద్‌ను ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు కలిసి అభినందించారు.

పిల్లలందరికీ విద్యార్థి మిత్ర కిట్



మండల విద్యాశాఖ కార్యాలయంలో సమగ్ర శిక్షణ పీడీ వెంకటరమణ

పెనుమూరు(కార్వేటినగరం): విద్యార్థులందరికీ విద్యార్థి మిత్ర కిట్లు అందేలా చూడాలని సమగ్రశిక్షణ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండలంలోని మోడల్ ప్రైమరీ పాఠశాల, భవిత కేంద్రంతో పాటు మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సమగ్రశిక్షణ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ వెంకటరమణ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నమోదు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలు వివరాలను ఎంఈఓ భాస్కర్ నాయుడును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్ఎం యామిని, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ అనురాధ, సీఆర్పీలు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు సత్కారం



చంద్రకాంత్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ అధికారులు

నగరి: మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదోన్నతిపై జమ్మలమడుగు మున్సిపాలిటీకి మేనేజర్‌గా వెళుతున్న చంద్రకాంత్‌ను స్థానిక మున్సిపల్ కమిషనర్, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. చంద్రకాంత్ మున్సిపాలిటీలో చేసిన సేవలను నెమరువేసుకున్నారు. దుశ్శాలువాలు, పూల దండలతో సత్కరించి వీడ్కోలు పలికారు. నగరి మున్సిపాలిటీలో తనకున్న బంధం విడదీయరానిదని మరో పదోన్నతితో నగరి మున్సిపాలిటీకి వచ్చే అవకాశం కల్పించాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని చంద్రకాంత్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, డీఈ రవీంద్ర, ఆర్ఓ తారకరామన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోండి



అవగాహన కల్పిస్తున్న చిత్తూరు రూరల్ ఈఈ సురేష్‌కుమార్

పెనుమూరు(కార్వేటినగరం): కేంద్ర ప్రభుత్వం రాయితీపై అందించే సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు ఏపీఎస్పీడీసీఎల్ రూరల్ ఈఈ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో వెలుగు, డ్వాక్రా మహిళలకు సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఈ మాట్లాడుతూ సోలార్ ద్వారా విద్యుత్‌ను సరఫరా చేసుకుంటే విద్యుత్ బిల్లులు ఖర్చు ఉండదని, సోలార్‌పై పెట్టిన పెట్టుబడి కూడా మూడేళ్లలో బిల్లుల రూపంలో వస్తుందన్నారు. ఒక్క కిలో వాట్‌కు రూ.78 వేలు ఖర్చు అవుతుందని, అందులో కేంద్రప్రభుత్వం రూ.30 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు రాయితీ ఇస్తుందని పేర్కొన్నారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. దీనిపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ శేషాద్రిరెడ్డి, ఏఈ తులసిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను కొనసాగించండి



అక్కనగారిపల్లె ప్రాథమిక పాఠశాల వద్ద ఆందోళన

గంగాధరనెల్లూరు: తమ గ్రామ ప్రాథమిక పాఠశాలలోనే తమ గ్రామ పిల్లలు చదువుకుంటారని, వేరే పాఠశాలకు పంపించేది లేదని విద్యార్థుల తల్లిదండ్రులు నష్టం చేస్తూ నిరసన తెలిపారు. గంగాధరనెల్లూరు మండలం అక్కన్నగారిపల్లి గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రాథమిక పాఠశాల వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అక్కన్నగారి పల్లి పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదు తరగతులకు చెందిన విద్యార్థులను గంగాధరనెల్లూరులో కలిపేయడం సరికాదన్నారు. చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిని పసిపిల్లలైన విద్యార్థులు ఎలా దాటుకుంటారని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు. తమ గ్రామంలోనే చదువుకునేలా ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరారు.

యోగాను పాఠ్యాంశం చేయాలి

కార్వేటినగరం: యోగాను జాతీయ విద్యలో అంతర్భాగం చేయాలని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్ఎం నాదమునిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక డీఎం పురం ఉన్నత పాఠశాలలో వ్యాయామ సంచాలకులు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం విద్యార్థులతో ప్రత్యేక యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు సరస్వతి, మాలతి, కళైవాణి, సుమతి, రాములు, రంజిత్‌కుమార్, పీడీ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పాలసముద్రం: మండలంలో నేడు నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ ఎస్.శివప్రకాష్‌రాజు, వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్, ఏపీఓ మార్గేట్, సూపర్‌వైజర్లు సుశీల, మురళి, ఏఈ జయరాజ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యోగా డేను విజయవంతం చేయండి

వెదురుకుప్పం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. శుక్రవారం వెదురుకుప్పంలో మండల స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. వెలుగు ఏపీఎం పరశురామిరెడ్డి, వ్యవసాయాధికారి వనిత పాల్గొన్నారు.

రైల్వే సమస్యలను పరిష్కరించండి

- రైల్వే డీఆర్ఎంకు విన్నవించిన వైఎస్ఆర్ సీపీ శ్రేణులు



డీఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్ఆర్ సీపీ శ్రేణులు

పుత్తూరు: మాజీ మంత్రి ఆర్కే రోజా సూచనల మేరకు దీర్ఘ కాలిక రైల్వే సమస్యలను పరిష్కరించాలని నగరి, పుత్తూరు వైఎస్ఆర్ సీపీ శ్రేణులు డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశాయి. శుక్రవారం పుత్తూరు రైల్వేస్టేషన్‌కు విచ్చేసిన డీఆర్ఎంను వారు కలిసి సమస్యలు ఏకరువు పెట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యగా ఉన్న ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ అండర్ బ్రిడ్జిని త్వరితగతిన నిర్మించాలని కోరారు. ప్రతిరోజు ఈ స్టేషన్ నుంచి అధిక సంఖ్యలో ప్రయాణికులు చెన్నై–తిరుపతికి వెళుతుంటారని తెలిపారు. ఒక్క చెన్నై–తిరుపతి మధ్య నడిచే ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌లోనే వంద మందికి పైగా ప్రయాణిస్తారన్నారు. వారికి తగిన షెల్టర్లు లేవని, మూడు షెల్టర్లను రైల్వేస్టేషన్ వద్ద నిర్మించాలని కోరారు. 2015–2023 వరకు మాజీ మంత్రి ఆర్కే రోజా నగరి, ఏకాంబరకుప్పం, పుత్తూరు రైల్వేస్టేషన్‌లలో వసతుల కోసం కేంద్ర మంత్రుల నుంచి డివిజనల్ మేనేజర్ వరకు వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నారన్నారు. వీటిపై స్పందించి ఇప్పటికే నగరి రైల్వే స్టేషన్ వద్ద 5 కోట్ల వ్యయంతో నిర్మించిన అండర్‌బ్రిడ్జి, సుమారు రూ.1.05 కోట్ల వ్యయంతో ఫుట్ ఓవర్ పాత్, రూ.75 లక్షల వ్యయంతో ప్లాట్‌ఫాం, ప్రయాణికులు కూర్చునే సిమెంటు కుర్చీలు, రూ.25 లక్షల వ్యయంతో ఎల్ఈడీ లైట్ల అమరిక, రూ.20 లక్షల వ్యయంతో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం, రూ.20 లక్షల వ్యయంతో పే అండ్ యూజ్ టాయ్‌లెట్స్, రూ.15 లక్షల వ్యయంతో సర్క్యులేటింగ్ ఏరియా డెవలప్‌మెంట్, రూ.15 లక్షల వ్యయంతో వెయిటింగ్ హాల్ నిర్మించారని తెలిపారు. ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్‌లో రూ.20 లక్షల వ్యయంతో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం పనులు సుమారు రూ.కోటి వ్యయంతో ఫుట్ ఓవర్ పాత్ నిర్మించారని, రిజర్వేషన్ ఉదయం 10 నుంచి 2వరకు మాత్రమే ఉంటే ఆ సమయాన్ని 8 నుంచి 2 వరకు పెంచి అడిషనల్ కౌంటర్‌ను కూడా ఏర్పాటు చేశారన్నారు. తాము గతంలో అడిగిన కోరికలలో ఏకాంబరకుప్పం వద్ద అండర్ బ్రిడ్జి పనులు మాత్రం జరగలేదన్నారు. అధికారులు వచ్చి పర్యవేక్షించి వెళ్లినా పనులు ప్రారంభించలేదన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, పుత్తూరు ఎంపీపీ మునివేలు, రమేష్‌రెడ్డి, అన్నా లోకనాథం, లక్ష్మణమూర్తి, బాలన్, బాలకృష్ణ, భూపాలన్, మురుగ, ఎల్లప్పరెడ్డి, ఆనంద్, సలీం, హమీద్, శశికుమార్ పాల్గొన్నారు.

సారా తయారీదారుపై పీడీ యాక్ట్

నగరి: మండలంలోని అడవికొత్తూరు గ్రామంలో పలుమార్లు సారా తయారీ, అమ్మకాల్లో పట్టుబడ్డ ఏకాంబరం అనే వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నవోదయం –2 పథకంలో భాగంగా నాటు సారా రహితంగా మార్చేందుకు అన్నివిధాలుగా ప్రయత్నాలు చేపడుతున్నామన్నారు. గ్రామాలలో నాటు సారాయి తయారు చేసి విక్రయించేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎక్కడైనా సారా తయారీ, విక్రయాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 14405కు గానీ, 9440902549 నెంబరుకు గానీ సమాచారం అందించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.